క్లుప్తంగా

తాగునీటికి సాగర్ జలాలు విడుదల

నకరికల్లు: తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ కుడి కాలువ ద్వారా గుంటూరు బ్రాంచి కెనాల్‌కు నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ రామకృష్ణ శనివారం తెలిపారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి కుడి కాలువకు 4.2 టీఎంసీలు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. కుడి కాలువ నుంచి గుంటూరు బ్రాంచి కెనాల్‌కు 1,500 క్యూసెక్కుల్ని సోమవారం విడుదల చేస్తామని ఆయన పేర్కొన్నారు. తాగునీటి చెరువులు, కుంటలు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్ని నింపుకునేందుకు నీటిని సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు సూచించారు. తాగునీటికి మాత్రమే నీటిని విడుదల చేస్తున్నందున పొలాలకు మళ్లించకూడదని ఆయన సూచించారు. దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సత్తెనపల్లిలో...

తాగునీటి అవసరాల కోసం సాగర్ నుంచి విడుదల చేస్తున్న నీటిని చెరువులు నింపడానికి మాత్రమే వినియోగించాలని సత్తెనపల్లి ఎన్ఎస్‌జేసీ ఓ అండ్ ఎం సెక్షన్–2 అసిస్టెంట్ ఇంజనీర్ డి.సుందరరావు శనివారం తెలిపారు. ఇతర ఏ అవసరాలకు ఈ నీటిని మళ్లించరాదని ఆయన సూచించారు.

25న వాహనాలకు వేలం పాట

నకరికల్లు: నాటుసారా, అక్రమంగా మద్యం రవాణా కేసుల్లో స్వాధీనం చేసుకున్న ఆటో, ద్విచక్ర వాహనాలకు ఈనెల 25న ఉదయం 10గంటలకు పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఎస్ఐ ఏ.బాలకృష్ణ శనివారం తెలిపారు. వేలం పాటలో పాల్గొనేందుకు రూ.2వేలు ధరావత్తు చెల్లించాలని సూచించారు. హెచ్చు పాటదారుడు అదేరోజు పాట మొత్తాన్ని లేదా కనీసం నాలుగో వంతు చెల్లించి మిగిలిన సొమ్మును రెండు రోజుల్లోగా చెల్లించాలని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు, రేపు గడప గడపకు మన ప్రభుత్వం


అచ్చంపేట: మండలంలోని కోగంటివారిపాలెం, అంబడిపూడి గ్రామాల్లో ఆది, సోమవారాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్ శనివారం తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఎంపీపీ కోరారు.

బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు



క్రోసూరు: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన శనివారం క్రోసూరు శివారు అచ్చంపేట పరిధిలో ప్రధాన రహదారిపై భారత్ పెట్రోల్ బంకు వద్ద జరిగింది. వాహనదారులు ఇద్దరూ తీవ్ర గాయాలతో రోడ్డుపై పడిపోయారు. గాయపడిన వారిని సత్తెనపల్లికి చెందిన సాకి గోపిగా, అచ్చంపేట మండలం వేల్పూరు గ్రామానికి చెందిన మోదుగుల సతీష్‌గా స్థానికులు గుర్తించారు. ఇద్దరిని 108లో సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

దేవాలయ నిర్మాణానికి స్థలం విరాళం



అచ్చంపేట: మండలంలోని గ్రంథశిరిలో శ్రీ సీ తారామస్వామి దేవాలయ నిర్మాణానికిగానూ రెండు సెంట్ల స్థలానికి సంబంధించిన డాక్యు మెంట్లను గ్రామానికి చెందిన కిలారి వీరా స్వామి శనివారం కమిటీ అధ్యక్షుడు బొల్లేపల్లి మల్లయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా దాత వీరాస్వామి మాట్లాడుతూ స్థలం విలువ రూ.10లక్షలు ఉంటుందని, తన తండ్రి వెంక య్య జ్ఞాపకార్థం నిర్మాణానికి ఇచ్చినట్లు చెప్పా రు. మాజీ సర్పంచ్ రావెళ్ల శ్రీధర్, కిలారి నరేంద్ర, ప్రభాకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

25న పెదకూరపాడు మండల పరిషత్ సమావేశం

పెదకూరపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నరసింహారావు తెలిపారు. ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

పేదలకు అందుబాటులో రాయితీపై టమాటాలు

- బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.120 పలికే టమాటాలు రూ.50కు అందజేత
- నాలుగో రోజు 1,200 కిలోల పంపిణీ



టమాటాలు పంపిణీ చేస్తున్న చల్లంచర్ల, పక్కన పెండెం బాబూరావు తదితరులు

సత్తెనపల్లి: పేదలకు టమాటాలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కృషి మేరకు ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రాయితీపై పంపిణీ చేస్తోందని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని వ్యవసాయం మార్కెట్ యార్డ్‌లో నాలుగో రోజు రాయితీపై పేదలకు టమాటాల పంపిణీలో భాగంగా శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంపిణీకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు అధ్యక్షత వహించారు. చల్లంచర్ల మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో కిలో టమాటా ధర రూ.120 ఉందని, అంత ధర పెట్టి పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేసే పరిస్థితి లేదన్నారు. దీంతో ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కిలో రూ.50కే రాయితీపై అందిస్తోందని చెప్పారు. మిగిలిన రూ.70 భారం ప్రభుత్వమే భరిస్తోందని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు మాట్లాడుతూ నాలుగో రోజు 1.200 కిలోల టమాటాల్ని వినియోగదారులకు అందించినట్లు తెలిపారు. అనంతరం క్యూలైన్‌లో వినియోగదారులకు టమాటాల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మార్కెటింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు నాలుగు రెట్ల పరిహారం ఇవ్వాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

సత్తెనపల్లి: పేరేచర్ల–కొండమోడు ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా సత్తెనపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నాలుగు రెట్లు నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి. కృష్ణయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో శనివారం జరిగిన బాధిత రైతుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. ఈ సమావేశానికి పీలా సాంబశివరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో పలువురు రైతులు మాట్లాడుతూ గుంటూరు రోడ్డులోని సత్తెనపల్లి మండలం కంటెపూడి నుంచి గార్లపాడు రోడ్డులోని సత్తెనపల్లి మంచినీటి చెరువు పక్కగా మాచర్ల రోడ్డులోని ధూళిపాళ్ల వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఇందులో 200 మందికి చెందిన 75 ఎకరాల భూమిని కోల్పోతున్నామని చెప్పారు. ఈ భూములు సత్తెనపల్లి పట్టణానికి పరిసర ప్రాంతం కావడంతో ఇప్పటికే ఇళ్ల స్థలాల ప్లాట్లుగా రిజిస్ట్రేషన్ అయ్యి ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, ఇళ్ల స్థలాలుగాగా కన్వర్షన్ కాకపోవడంతో పంట భూములుగానే గుర్తించి ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తామంటుందని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నాలుగు రెట్లు ధర నిర్ణయించి నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సంఘం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య మాట్లాడుతూ భూములు కోల్పోయిన రైతులందతా ఐక్యమై న్యాయం జరిగే వరకూ దశలవారీగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. సీనియర్ న్యాయవాది దేవినేని దస్తగిరి మాట్లాడుతూ బాధిత రైతులకు ఉచిత న్యాయ సహాయాన్ని అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మరొక సీనియర్ న్యాయవాది చలువాది చిన్న సత్యనారాయణ మాట్లాడుతూ బైపాస్ రోడ్డు పక్కన భూములవారికి కోట్ల రూపాయలు ధర పలుకుతుంటే, వాటిని కోల్పోయిన రైతులకు నామమాత్రంగా పరిహారం అందజేస్తే సహించేది లేదని తెలిపారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా ధరను నిర్ణయించి పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు బాధిత రైతుల అసమ్మతి పిటిషన్లు ఇవ్వాలని సమావేశం నిర్ణయించింది. రైతులు చుక్కపల్లి శ్రీనివాసరావు, మేకల కామేశ్వరరావు, యల్లినేడి వెంకటేశ్వరరావు, దుగ్గినేని నరసింహారావు, ప్రజాసంఘాల నాయకులు గుంటుపల్లి బాలకృష్ణ, పెండ్యాల మహేష్, అవ్వారు ప్రసాదరావు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం, బాలికల గురుకులం తనిఖీ

సత్తెనపల్లి: పట్టణంలోని మాతృశ్రీ మొల్లమాంబ అనాథ, వృద్ధుల ఆశ్రమాన్ని, సత్తెనపల్లి మండలం రామకృష్ణపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి డి. నాగ వెంకటలక్ష్మి శనివారం తనిఖీ చేశారు. ముందుగా ఆశ్రమంలో ఆహారం, ఇతర సౌకర్యాల గురించి వృద్ధుల్ని అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్‌ను పరిశీలించి ఆశ్రమ నిర్వాహకులకు కొన్ని సూచనలు చేశారు. అనంతరం గురుకుల పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు.బోధన, ఆహారం, ఇతర సౌకర్యాల గురించి విద్యార్థినుల్ని అడిగి తెలుసుకున్నారు. వంటశాలను, రిజిస్టర్లను తనిఖీ చేశారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీని చూసి పలు సూచనలు చేశారు. ఆమె వెంట ప్యానల్ న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, బి. లక్ష్మీకోటేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని ఉన్నారు.

సీజన్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



పెదకూరపాడు: సీజన్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 75త్యాళ్ళూరు వైద్యాధికారి వెలుగొండరెడ్డి సూచించారు. పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో డెంగ్యూ, మలేరియా, సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ వెలుగొండరెడ్డి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం అంతా ఇంటి పరిసరాల్ని శుభ్రం చేసుకోవాలని చెప్పారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, జ్వరం ఉంటే వెంటనే వైద్యుల్ని సంప్రదించాలని సూచించారు. ఇప్పటికే ఇంటింటికీ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ దిలీప్‌కుమార్, బేగం, విజయకుమార్, ఏసమ్మలు పాల్గొన్నారు.

క్రోసూరులో భారీ వర్షం

క్రోసూరు: మండలంలో అన్ని గ్రామాల్లో గత రెండు రోజులుగా మోస్తరుగా వర్షం కురుస్తుండగా శనివారం మాత్రం జోరుగా కురిసింది. పంట పొలాలు తడిసి ముద్దయ్యాయి. వీధులన్నీ వర్షం నీటితో నిండిపోయాయి. గత వారంలో కురిసిన వర్షాలకు పలువురు రైతులు విత్తనాలు చల్లుకోగా, మొలకలు కూడా వచ్చాయి. మండలంలో కురుస్తున్న ప్రస్తుత వర్షాలపై రైతులు సంతోషాలు వ్యక్తం చేస్తున్నారు. పొలం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీలకు చేతినిండా పని దొరికింది.

అమరావతి అమరేశ్వరుడికి విరాళాలు

అమరావతి: ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన అమరావతి అమరేశ్వరుడికి శనివారం భక్తులు విరాళాలుగా రూ. 43,524ను సమర్పించినట్లు ఈవో వేమూరి గోపీనాథశర్మ తెలిపారు. నిత్య కల్యాణానికి రూ. 11,116, నిత్యాభిషేకానికి రూ.3116, అన్న దానానికి రూ. 23,900 సమర్పించారని ఆయన వివరించారు.

కళ్లజోళ్ల పంపిణీ

పిడుగురాళ్ల: పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల ఆధ్వర్యంలో శనివారం కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ జూన్‌లో శంకర్ కంటి హాస్పిటల్ సహకారంతో ఉచితంగా కంటి శుక్లాల ఆపరేషన్ చేయించుకున్న వారందరికీ కళ్లజోళ్లను పంపిణీ చేసినట్లు చెప్పారు.

విద్యార్థులకు సెమిస్టర్-2 పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు

నకరికల్లు: పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, సమ దుస్తులు, బూట్లు అందజేసిన ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నర్సింగపాడు ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు సెమిస్టర్–2 పుస్తకాల్ని శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపురేఖల్ని కార్పొరేట్‌ను తలదన్నేలా సీఎం జగన్ మార్చారని కొనియాడారు. విద్యా ప్రమాణాలు, నాణ్యతల్లో ఇతర దేశాలు సైతం ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సూర్యకుమారి, ఉపాధ్యాయుడు తుమాటి సుబ్బారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో..

స్థానిక జెడ్పీ పాఠశాలలో శనివారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాల్ని మండల విద్యాశాఖాధికారి–2 సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఇప్పటికే సెమ్–1కు సంబంధించి పాఠ్య పుస్తకాల్ని అందించామని, ప్రస్తుతం సెమ్–2 పాఠ్య పుస్తకాల్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.వెంటకరమణ, ఉపాధ్యాయులు రాయపూడి సాంబశివరావు, నరేష్, జ్యోతి పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలకు బీజేపీ నిర్లక్ష్యమే కారణం



అమరావతిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

అమరావతి: మణిపూర్‌లో రెండు జాతుల మధ్య మూడు నెలల నుంచి జరుగుతున్న విద్వేషకర సంఘటనల్ని నివారించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని ప్రజా సంఘాల మండల కన్వీనర్ బి. సూరిబాబు విమర్శించారు. మణిపూర్‌లో జరుగుతున్న దారుణ సంఘటనలకు నిరసనగా శనివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ విద్వేషకర సంఘటనలపై ప్రేక్షక పాత్ర వహిస్తున్న మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రి భైరన్‌సింగ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని ప్రశాంత వాతావరణంలోకి తీసుకురావాల్సిన బాధ్యత బీజేపీ ప్రభుత్వానిదేనని తెలిపారు. మహిళా హక్కుల సంఘం నాయకుడు లక్ష్మణ్ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై నీచాతి నీచంగా అత్యాచారం చేసిన దుండగుల్ని వెంటనే కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మునుగోడు శ్రీనివాసరావు ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ, వివిధ ప్రజా సంఘ నాయకులు మోదిన్‌వలి, శంగారపాటి రాజకుమార్, సీఐటీయూ నాయకులు ఎస్‌కే. రఫీ, గుడిసె సతీష్ పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో...

మణిపూర్‌లో మారణ హోమాన్ని నియంత్రించి రాజ్యాంగ, మానవ హక్కుల్ని కాపాడాలని జై భీమ్ భారత్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జె. విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో సత్తెనపల్లి తాలూకా సెంటర్ శనివారం జరిగిన నిరసనలో ఆయన మాట్లాడారు. మణిపూర్‌లో శాంతిని స్థాపించి ప్రజల్లో గూడుకట్టుకున్న అభద్రతా భావాన్ని తొలగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అంబేడ్కర్ ప్రజా సంఘం జిల్లా అధ్యక్షుడు దావులూరు కోటేశ్వరరావు, మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు గుంటూరు ఆశీర్వాదం మాట్లాడారు. అనంతరం నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. తొలుత పలువురు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మణిపూర్ ఘటన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాంతగి సుధాకర్రావు, మహంకాళి వెంకట్రావ్, మాల మహానాడు పట్టణ అధ్యక్షుడు జాన్‌బాబు, బలిజెపల్లి సతీష్, పైర్ల శ్రీకాంత్, తురక నవీన్, జెర్రిపోతు లోకేష్, జమ్మలమూడి మార్కు, నలబోలు రాజా పాల్గొన్నారు.

కండ్లకుంట సచివాలయంలో ఆధార్ సేవలు ప్రారంభం



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, అధికారులు

నకరికల్లు: సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులోకి తీసుకురావడం సుపరిపాలనకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి తెలిపారు. మండలంలోని కండ్లకుంట గ్రామంలోని సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి, ప్రభు త్వ సేవల్ని ప్రజలకు చేరువ చేశారని చెప్పారు. గతంలో పట్టణాలకు వెళ్లి ఆధార్ కార్డులో మార్పు లు, చేర్పులు చేసుకోవాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు గ్రామ సచివాలయాలకే ఆధార్ సేవలు రావడం శుభపరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ కంఠమనేని చందు, సొసైటీ మాజీ అధ్యక్షుడు కంఠమనేని కోటయ్య, గ్రామ కార్యదర్శిసత్యనారాయణ, వీఆర్వో బ్రహ్మయ్య, బక్కా గురవయ్య, అట్లూరి పోలేష్, వట్టికుంట రామకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు వలంటీర్లు బుద్ధి చెప్పడం ఖాయం



ధ్రువపత్రాలను అందిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

రాజుపాలెం: గ్రామ వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ నాయకులకు త్వరలో వారే తగిన శాస్తి చేస్తారని సర్పంచ్ పులిబండ్ల అశోక్ అన్నారు. మండలంలోని రాజుపాలెం, ఇనిమెట్ల గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష సభల్ని శనివారం నిర్వహించారు. ఇందులో 93 మందికి కుల ధ్రువీకరణ, 82 మందికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు 16 మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు అందించారు. మొత్తం 264 సమస్యల్ని పరిష్కరించారు. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సాంబశివరావు పాల్గొని జగనన్న సురక్ష ప్రాముఖ్యత గురించి వివరించారు. జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, సర్పంచ్ ఓర్సు వెంకటపతి, ఆర్‌బీకే సలహా మండలి చైర్మన్ నాగేశ్వరరావు, తహసీల్దారు నళిని, ఎంపీడీవో టి.శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ ముక్కంటి, పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చర్మకారుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి మేరుగ నాగార్జునకు వినతి పత్రం అందజేస్తున్న చర్మకారుల సేవా సంఘం ప్రతినిధులు

క్రోసూరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ చర్మకారుల సేవా సంఘం ప్రతినిధులు శనివారం గుంటూరులో రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి మేరుగ నాగార్జునకు వినతిపత్రం అందజేశారు. క్రోసూరు పాలిటెక్నిక్ కళాశాలలో లెదర్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు ప్రారంభించాలని, నియోజకవర్గంలోని చర్మకారులకు చెప్పుల తయారీ ట్రెయినింగ్ సెంటర్ క్రోసూరులో ఏర్పాటు చేయాలని కోరారు. క్రోసూరు ప్రధాన రహదారి , ఆర్ అండ్‌బీ భవనం నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయం వరకు ఎస్సీ కాంప్లెక్స్ గదులు నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మాదిగ జాతి సంక్షేమం కోసం కేంద్రం నుంచి మంజూరైన రూ. 65 కోట్లను డప్పు కళాకారులకు, చర్మకారుల అభివృద్ధి కోసం వినియోగించాలని విన్నవించారు. ఒక్కొక్కరికీ లక్ష రూపాయల్ని ఎస్సీ కార్పొరేషన్ నుంచి అందించాలని కోరారు. లెదర్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్‌ను 26 జిల్లాలకు విస్తరించి 300 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ జిల్లా, ప్రకాశం జిల్లా, చిత్తూరు, విజయనగరంతో పాటు పల్నాడు జిల్లాలో చర్మకారుల అభ్యున్నతి కోసం లెదర్ పార్కులు ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రిని కలసిన వారిలో రాష్ట్ర చర్మకారుల సంఘం అధ్యక్షుడు బుల్లా రాజారావు, ప్రధాన కార్యదర్శి గార్లపాటి దాసు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ దున్న నాగయ్య, జిల్లా జనరల్ సెక్రటరీ కొరివిపాటి ప్రశాంతి ఉన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మారూరి పద్మ, పక్కన జెడ్పీటీసీ సభ్యురాలు చంద్రకళ

ముప్పాళ్ల: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మండల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీపీ మారూరి పద్మ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనేక విప్లవాత్మకమైన మార్పులతో గ్రామాల్లో అవినీతిరహిత పాలన అందుతోందన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. అధికారులు ఇళ్ల వద్దకే వెళ్లి, అర్హుల్ని గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందేందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల్ని జగనన్న సురక్ష ద్వారా అందిస్తున్నారని ఎంపీపీ వివరించారు. తహసీల్దార్ ఎం.భవానీశంకర్ మాట్లాడుతూ మండలంలో త్వరలో భూముల రీసర్వే ప్రారంభం కానున్నదని వెల్లడించారు. భూముల ఆన్‌లైన్ సమస్యల్ని చాలా వరకు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కౌలు కార్డులకు అర్హులైన రైతులంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు పొందేలా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. పశువైద్యాధికారి పుల్లారెడ్డి మాట్లాడుతూ పశుపోషకులకు సబ్సిడీపై రైతులకు గడ్డి విత్తనాలు, పశుదాణా అందిస్తున్నామని తెలిపారు. ఈఓపీఆర్డీ రూపవతి మాట్లాడుతూ వర్షాకాలం ఆరంభం కావడంతో గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, బావుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంఈఓ ఒంగోలు రాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించేలా తల్లిదండ్రుల్ని ప్రోత్సహించాలని చెప్పారు. బొల్లవరం ఎంపీటీసీ సభ్యుడు కళ్లం వీరభాస్కరరెడ్డి మాట్లాడుతూ రుద్రవరం–బొల్లవరం లింకు రోడ్డు నిర్మాణం పనుల్ని త్వరితగతిన చేపట్టి పూర్తిచేయాలని అధికారుల్ని కోరారు. ఆయా శాఖల అధికారులు పాల్గొని తమ శాఖల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సేవల్ని వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు శిరిగిరి చంద్రకళ, ఎంపీడీవో పి.పుట్టారెడ్డి, వైస్ ఎంపీపీ రాయన్న, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ- పంట నమోదు తప్పనిసరి



శిక్షణలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి, పక్కన తహసీల్దార్ సురేష్

సత్తెనపల్లి: రైతులు, కౌలు రైతులు సాగు చేసే అన్ని రకాల పంటల్ని ఒక్క ఎకరం కూడా వదలకుండా ఈ- పంట నమోదు చేయాలని సత్తెనపల్లి ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్ రెడ్డి చెప్పారు. పట్టణ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మండలంలోని గ్రామ సచివాలయ స్థాయిలో పని చేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులకు ఖరీఫ్ -2023 సీజన్‌కు ఈ - పంట నమోదు కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులందరూ తప్పనిసరిగా భూయజమాని అంగీకారంతో సీసీఆర్సీ కార్డులు గ్రామ రెవెన్యూ అధికారి వద్ద నుంచి పొందాలని సూచించారు. పంట సాగు హక్కు పత్రం తీసుకుంటేనే వారి పేరు మీద ఈ- పంట నమోదు చేస్తామని తెలిపారు. తహసీల్దార్ ఎస్. సురేష్ మాట్లాడుతూ రెవెన్యూ, వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో ఈ–పంట నమోదు చేయాలని సూచించారు. రైతులు, కౌలు రైతులు ఈ - పంట నమోదు చేయించుకోవడం వల్ల అనేక రాయితీలు పొందవచ్చని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తుల్ని మద్దతు ధరకు విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ శివ బాబు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులు ఉన్నారు.

పెదకూరపాడులో..

స్థానిక రైతు భరోసా కేంద్రంలో శనివారం గ్రామ రెవెన్యూ అధికారులకు, వ్యవసాయశాఖ సిబ్బందికి ఖరీఫ్‌లో ఈ- క్రాప్ నమోదుపై శిక్షణ ఇచ్చారు. సాగు చేసే ప్రతి రైతు, కౌలు రైతు తప్పని సరిగా ఈ- క్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖాధికారి ఇంజం శాంతి సూచించారు. భూ యజమాని అనుమతితో కౌలు రైతులు కౌలు కార్డులు పొందవచ్చని ఆమె తెలిపారు. డెప్యూటీ తహసీల్దార్ నిర్మల కృష్ణ మాట్లాడుతూ భూ యజమానులంతా కౌలు రైతులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు



శిక్షణలో మాట్లాడుతున్న ఏడీఏ వి.హనుమంతరావు

దొడ్లేరు(క్రోసూరు): నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు సాధ్యమని ఏడీఏ వి.హనుమంతరావు తెలిపారు. మండలంలోని దొడ్లేరు రైతుభరోసాకేంద్రం–2 లో శనివారం గ్రామ విత్తనం పథకం తొలిదశలో భాగంగా రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీఏ హనుమంతరావు మాట్లాడుతూ 25కిలోల విత్తనాల బ్యాగులో ఒక్క గింజ కూడా వేరే రకం కలవకూడదన్నారు. అలా కలిస్తే జన్యు స్వచ్ఛత తగ్గిపోతుందని తెలిపారు. నాగార్జునసాగర్‌లో నీరు తక్కువగా ఉన్నందున ఏ పంట వేస్తే బాగుంటుందో ఆలోచించుకుని సాగు చేసుకోవాలని చెప్పారు. ఏవో వేణుగోపాల్ మాట్లాడుతూ విత్తనాల్ని రైతులంతా జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. ఏడీఏ(డీఆర్‌సీ) శివ కుమారి మాట్లాడుతూ ముందుగా రైతులు దమ్ములో భాస్వరం వేయాలని సూచించారు. యూరియా, ఎస్ఎస్‌పీ, ఎంవోపీ వంటి ఎరువుల్ని మాత్రమే వేయాలని తెలిపారు. నత్రజని పిలకలు బాగా వచ్చేందుకు, భాస్వరం వేరు వ్యవస్థ పటిష్ట పడటానికి ఉపయోగపడతాయని తెలిపారు. పొటాష్‌తో కాండం దృఢంగా ఉండటంతో పాటు గింజ కూడా విరగదని చెప్పారు. భాస్వరం వేసిన వెంటనే ఎస్ఎస్‌పీ జింక్ వేయకూడదని, రెండు రోజుల ముందుగాని, రెండు రోజుల తర్వాత గానీ వేయాలని తెలిపారు. కార్యక్రమంలో దొడ్లేరు గ్రామ రైతులు, రైతుభరోసాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.